ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం జిల్లా వార్తలు
8
గురువారం 5 సెప్టెంబరు 2024



స్థానికంగా ఉండి వైద్యం అందించాలి

బెజ్జూరు, సెప్టెంబరు 4: వైద్య సిబ్బంది స్థానికంగాఉండి వైద్యం అందించాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, మందుల స్టాక్, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి రోగులకు సరైనవైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బంది విధులకు హాజరైనా సంతకాలు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఆసుపత్రిలో జ్వరపీడితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఎడతెరపిలేని వర్షం

- నాలుగు రోజులుగా కుండపోత
- జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు
- తెగిపోయిన కల్వర్టులు, రాకపోకలకు అంతరాయం
- కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత

ఆసిఫాబాద్, సెప్టెంబరు 4: జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎడతెరిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో జిల్లాలో పలుచోట్ల వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టులు, చెరువులలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. జిల్లా సరిహద్దుల్లో పెన్‌గంగా, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవాహిస్తున్నాయి. గురువారం తెల్లవారుజామున సుమారు రెండు గంటలు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ఉధృతికి లోలెవల్ వంతెనలు ఉప్పొంగి ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా బుధవారం 27.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

లోతట్టు ప్రాంతాలు జలమయం..

జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్‌కాలనీలో వరదనీరు వచ్చి చేరడంతో రోడ్లు చెరువులను తలపించాయి. వాంకిడి మండలంలో ఖిరిడి గ్రామంలో వరదనీరు ముంచెత్తడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లన్నీ వరదనీటితో నిండిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. వాంకిడి, ఖనర్‌గాం గ్రామాల మధ్య ఉన్న దుబ్బ గూడ లోలెవల్ వంతెనపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు నాలుగు గంటల వరకు ఆయాగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెంచికల్‌పేట మండలంలో భారీ వర్షానికి ఆదర్శ అంగన్‌వాడీకేంద్రంలోకి వరదనీరు వచ్చి చేరడం తో సరుకులు తడిసిముద్దయ్యాయి.

తెగిన కల్వర్టులు, నీటమునిగిన పంటలు..

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు నీట మునిగి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. జిల్లాలో సుమారు వేయిఎకరాల్లో పంటలు నీటమునిగినట్లు అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాలకు ఆసిఫాబాద్ మండలంలోని మాలన్‌గొంది, అప్పపెల్లి కల్వర్టులతోపాటు జిల్లా వ్యాప్తంగా సుమారు 14కల్వర్టులు తెగిపోయాయి. అలాగే జిల్లాలో12 రహదారులు దెబ్బతిన్నాయి. తిర్యాణి మండలంలోని కైరిగూడ ఓపెన్‌కాస్టు వద్ద నిర్మించిన వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోయింది. సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట మండలాల సరిహద్దుల్లోని ప్రాణహిత, పెన్ గంగా పరివాహక ప్రాంతాల్లో పంటచేనులు మూడురోజులుగా వరదనీటిలోనే మునిగి ఉండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టులలోకి భారీగా వరదనీరు..

జిల్లాలో నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులలోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. కుమరంభీం ప్రాజెక్టులో 8970 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండడంతో ఐదుగేట్లను ఎత్తి 10,480 క్యూసెక్కుల వరదనీటిని కిందికి పంపుతున్నారు. అలాగే వట్టివాగు ప్రాజెక్టులో 7770క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో రెండుగేట్లు పైకి ఎత్తి 2160క్యూసెక్కుల వరదనీటిని అధికారులు కిందికి వదులుతున్నారు. దీంతో పెద్దవాగు నది పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



కుమరంభీం ప్రాజెక్టు ఐదుగేట్ల ద్వారా కిందికి ప్రవహిస్తున్న నీరు

జిల్లా వ్యాప్తంగా 27.4మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు..

జిల్లా వ్యాప్తంగా బుధవారం 27.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జైనూరులో 89.7మిల్లీమీటర్లు, సిర్పూర్(యు)లో 35.2, లింగాపూర్‌లో 28.7, తిర్యాణిలో 39.9, రెబ్బెనలో 45.5, ఆసిఫాబాద్‌లో 40.2, కెరమెరిలో 59.1, వాంకిడిలో 62.5, కాగజ్‌నగర్‌లో 8.0, సిర్పూర్(టి)లో 2.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా జైనూరులో 89.7 మిల్లీమీటర్లు, అత్యల్పంగా సిర్పూర్(టి)లో 2.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అంగన్‌వాడీ కేంద్రాల్లోకి వరదనీరు..

పెంచికలపేట: మండలంలోని ఎల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడ, కోయచిచ్చాల అంగన్‌వాడీకేంద్రాలు బుధవారం ఉదయం కురిసిన వర్షానికి నీరుచేరి అధ్వానంగా తయారయ్యాయి. గర్భిణులకు, పిల్లలకు అందించాల్సిన బియ్యం, గుడ్లు, తదితర వస్తువులు తడిసి ముద్దయ్యాయి. పరిసర ప్రాంతాలు బురదమయంగా మారి దోమలవ్యాప్తికి నిలయంగా మారాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కెరమెరిలో లో లెవల్ వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

మండలాల్లో..

వాంకిడి: మండలంలోని సవ్వాతి, దాబా, ఎనోలి, కిర్డి, పిప్పర్‌గొంది, తదితర గ్రామాలకు వెళ్లేరహదారులు, కల్వర్టులు వరదలకు దెబ్బతిన్నాయి. మండల కేంద్రంలోని రాంనగర్‌లో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధగ్రామాలకు వెళ్లే రహదారులు వంతెనలు వరదలకు దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంపీవో వరదలకు దెబ్బతిన్న రోడ్లనుపరిశీ లించారు. రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయించి రాకపోకలు పునరుద్ధరించారు.

కెరమెరి: మండలంలోని వాగులు, ఒర్రెలు ఉప్పొంగాయి. లక్మాపూర్, అనార్‌పల్లి గ్రామాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాగు అవతల ఉన్న లక్మాపూర్, శంకర్‌లొద్ది, కరంజీవాడ, జన్కాపూర్ తదితరులు గ్రామాల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసరవేళ్లలో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి ప్రయాణించాల్సిన పరిస్థితినెలకొంది. అలాగే సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య ఉన్న లోలెవల్‌వంతెనపై రెండుగంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టుప్రాంతాల పంటపొలాల్లో వరదనీరునిలిచి పత్తి, కందిపంట నష్టపోయే అవకాశాలు ఉన్నట్లు పలువురు తెపారు.

దహెగాం: మండలవ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని పలువీధుల్లో డ్రెయినేజీలలో పూడిక తీయకపోవడంతో రోడ్లపై వరదనీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కాగజ్‌నగర్: పట్టణంలో బుధవారం ఉదయంనుంచి వర్షం కురిసింది. దీంతో అంతర్గతరోడ్లు బురదమయంగా మారాయి. చిరువ్యాపారులు దుకాణాలు పెట్టుకోని పరిస్థితి ఏర్పడింది. ఎగువప్రాంతంలో భారీవర్షాలు కురుస్తుండటంతో కాగజ్‌నగర్ పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెవెన్యూ, పోలీసు అధికారులుస్పందించి పెద్దవాగు పరిసరప్రాంతాల వారిని అప్రమత్తం చేశారు.

సిర్పూర్(టి): కురుస్తున్న వర్షాలకు మూడురోజులుగా మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం వరదఉధృతి కాస్తతగ్గ ముఖం పట్టడంతో రాకపోకలు పునఃప్రారంభ మయ్యాయి.









వాంకిడి మండలంలో జలమయమైన ఖిరిడి గ్రామం, పెంచికల్‌పేట మండలంలోని కొత్తగూడ ఎల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చిన వరదనీరు, అసిఫాబాద్ మండలంలోని కోతకు గురైన అప్పపెల్లి తాత్కాలిక రోడ్డు, పెంచికలపేటలోని కొత్తగూడ అంగన్‌వాడీ కేంద్రంలో వర్షం నీరు



వాంకిడిలోని రాంనగర్‌లో ఇళ్లలోకి చేరిన వరద నీరు

సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో దత్తారాం

- విధులు సక్రమంగా నిర్వహించని సిబ్బందికి పెనాల్టీ రూ.15,500
- రూ.75,600ల రికవరీ ఆదేశాలు
- 17మంది సిబ్బందికి షోకాజు నోటీసులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 4: కాగజ్‌నగర్ మండలంలోని 28గ్రామ పంచాయతీల్లో 2023-24వరకు నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్ర మాన్ని బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 28గ్రామ పంచాయతీలకు కేటాయించిన జిల్లా రిసోర్స్ పర్సన్లు నివేదికలను చదివి సభా దృష్టికి తీసుకవచ్చారు. 382పనులకుగాను రూ.4.43కోట్లు కేటాయించినట్టు, పంచాయతీరాజ్ పనులకింద 129పనులకు గాను రూ.5.39కోట్లతో పనులు చేసినట్టు తెలిపారు. ఈ పనుల్లో పలు మండలాల సిబ్బంది రోజువారి కూలి మస్టర్‌ను దిద్దుబాటు చేసినట్టు వివరించారు. అలాగే నిధులు రూ.76,000సక్రమంగా పంపిణీ కాలేదని సభా దృష్టికి తీసుకవచ్చారు.

ప్రజలకు పారదర్శకత కోసమే..: డీఆర్డీవో దత్తారాం

ఉపాధి హామీ పథకంలో పారదర్శకత కోసమే సామాజిక తనిఖీలు నిర్వహించి ప్రజావేదిక ద్వారా పూర్తి వివరాలను వెల్లడించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు డీఆర్డీవో దత్తారాం తెలిపారు. తనిఖీ బృంద సభ్యులిచ్చిన నివేదికల్లోని తప్పులు పునరావృతం కాకుండా ఉపాధిహామీ సిబ్బంది చూసుకోవాలన్నారు. చక్కటి పని తీరును ప్రదర్శించి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. నివేదికల ఆధారంగా కాగజ్‌నగర్ మండలంలో విధులు సక్రమంగా నిర్వహించని సిబ్బందికి రూ.15500 పెనాల్టీ వేసినట్టు తెలిపారు. అలాగే నిధుల కేటాయింపులో రూ.76,000వేలు చెల్లించలేదన్నారు. వీటిని వెంటనే రికవరీ చేయాలని ఆదేశిస్తున్నట్టు తెలిపారు. వీటితోపాటు ఉపాధి హామీ పథకంలో విధులు సక్రమంగా నిర్వహించని 17 మంది సిబ్బందికి షోకాజు నోటీసులిచ్చినట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఓంబుడ్స్ పర్సన్ సాయిశ్రీ, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేష్, రాష్ట్ర టీం మేనేజర్ వేణు, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ రంజిత్, అదనపు అధికారి బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ బంద్ సంపూర్ణం



సిర్పూర్(యు)పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం ఇస్తున్న ఆదివాసీలు

సిర్పూర్(యు), సెప్టెంబరు 4: మండలంలో బుధవారం ఆదివాసీసంఘాలు ఇచ్చిన ఏజెన్సీబంద్ సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. మండలకేంద్రంలోని రాస్తారోకో చేశారు. ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం చేసినవ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం అందించారు. మండల కేంద్రంలోని దుకాణాలు, హోటల్‌లు, పాన్ షాపులు స్వచ్ఛందంగా మూసివేసిబంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాయిసెంటర్ సార్మెడి ఆత్రం ఆనంద్‌రావు, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఆదివాసీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని ఉరితీయాలి..

బెజ్జూరు: మండలకేంద్రంలో బుధవారం జిల్లా పీసా ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఫాస్ట్‌ట్రాక్ చట్టంకింద అత్యాచారం కేసు నమోదు చేసి కఠినశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో శంకర్, తిరుపతి, సకారాం, శంకర్, బక్కయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్: నిందితుడిని కఠినంగా శిక్షించాలని బుధవారం లింగాపూర్ మండల ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివాసీసంఘాల పిలుపు మేరకు మండల వ్యాపారులు బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో రాథోడ్ రమేష్, రాథోడ్ మలిరాం, మంగులాల్, ముసికెశంకర్, కురసెంగా ఆనంద్‌తిదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ ఆధ్వర్యంలో రాస్తారోకో..

కెరమెరి: మండలకేంద్రంలో జైనూరు ఘటనను నిరసిస్తూ తుడుందెబ్బ, ఆదివాసీసంఘాల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్-ఆదిలాబాద్ ప్రధానరహదారిపై బస్టాండ్ ఏరియాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ నాయకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు. దీనికి నిరసనగా రేపు కెరమెరి బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోతీరాం, భరత్‌భూషణ్, ఇందిర,దుందెరావుతదితరులు పాల్గొన్నారు.



బెజ్జూరులో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు



కెరమెరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న తుడుందెబ్బ, ఆదివాసీ నాయకులు



లింగాపూర్‌లో..



బొగ్గు గనుల వేలంతో సింగరేణికి నష్టం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 4: కేంద్రం ప్రవేశపెట్టిన బొగ్గు గనుల వేలం పాటతో సింగరేణిసంస్థకు నష్టం వాటిల్లనుందని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం హెచ్‌ఎంఎస్ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోని నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయించేలా రాష్ట్రప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈబొగ్గుబ్లాకులు రాకపోతే ఉపాధిఅవకాశాలు ఉండవని తెలిపారు. ఈ బొగ్గుబ్లాకులను సింగరేణికి కేటాయించడం ద్వారా మరో 5దశాబ్దాల పాటు ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు లభిస్తాయని, సంస్థ మనుగడ బాగుంటుందన్నారు. ఈవిషయాలను కార్మికులకు వివరిస్తామని పేర్కొన్నారు. నాయకులు సుదర్శన్,యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 600మందికి పదోన్నతులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 4: మందమర్రిఏరియాలో ఆయా గనులు, డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న 600మంది కార్మికులకు పదోన్నతులు లభించనున్నాయని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్రసత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏరియాలోత్వరలోనే 600మందికిపదోన్నతులు లభించనున్నాయని, ఇదిపూర్తిగా తమయూనియన్ చొరవతోనే సాధ్యమైందన్నారు.సింగరేణి కార్మికులకు 35శాతం లాభాలవాటా చెల్లించాలని లేకుంటే ఉద్యమాలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు వినోద్, తిరుపతి, పాండు పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

జైపూర్, సెప్టెంబరు 4: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ) యూనిట్2లో విద్యుత్ ఉత్పత్తి బుధవారం ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. 600మెగావాట్ల సామర్థ్యం గల రెండవ యూనిట్‌లో సమగ్ర పరిశీలన(క్యాపిటల్ ఓవరాలింగ్)లో భాగంగా జూన్ 15నుంచి సెప్టెంబరు 3 వరకు సుమారు 80రోజులపాటు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. క్యాపిటల్ ఓవరాలింగ్ పూర్తి కావడంతో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

వేతన సమస్య పరిష్కరించకుంటే సమ్మె

శ్రీరాంపూర్, సెప్టెంబరు 4: కన్వేయన్స్ డ్రైవర్ల వేతన సమస్య పరిష్కరించకుంటే సమ్మె తప్పదని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్షుడు దూలం శ్రీనివాస్ హెచ్చరించారు. శ్రీరాంపూర్‌లో ఆయన మాట్లాడారు. మంగళవారం అద్దెవాహనాల యజమానులు, కన్వేయన్స్ డ్రైవర్లకు మధ్య చర్చలు జరిగాయన్నారు. అయితే ఈచర్చల్లో వాహనాల యజమానులు మొండి వైఖరి ప్రదర్శించారన్నారు. 8గంటల వాహనానికి డ్రైవర్‌కు 23,854రూపాయలు, 12గంటల వాహనానికి డ్రైవర్‌కు 35,781 రూపాయలు సింగరేణి ద్వారా అద్దెవాహన యజమానులకు అందుతున్నాయన్నారు. కానీవారు డ్రైవర్లకు మాత్రం 14వేలనుంచి 16వేల రూపాయల వరకు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. డ్రైవర్ల పేరిట సీఎంపీఎఫ్ జమ చేయాల్సి రావడంతో ఇచ్చే వేతనాల్లోంచి కోత పెట్టి 11వేల రూపాయల నుంచి 14 వేల రూపాయల వరకు మాత్రమే ఇస్తామని యజమానులు మొండిగా వాదిస్తున్నారన్నారు. ఈ విషయంలో సింగరేణి అధికారులు స్పందించి డ్రైవర్లకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 11వ తేదీ తరువాత సమ్మె చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వేయన్స్ డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ఆర్‌కే-2 గ్రూపు జట్టు విజయం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 4: కార్మిక వార్షిక క్రీడల్లో భాగంగా ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం కబడ్డీపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా క్రీడల గౌరవకార్యదర్శి కె పాల్‌సృజన్ హాజరయ్యారు. ఆర్‌కే-1గ్రూపు, ఆర్‌కే-2 గ్రూపు జట్లు తలపడ్డాయి. ఇందులో ఆర్‌కే-2 గ్రూపు జట్టు విజయం సాధించగా, ఆర్‌కే-1గ్రూపు జట్టు రెండవస్థానంలో నిలిచింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ సిహెచ్. అశోక్, కో-ఆర్డినేటర్ ఎస్. నర్సయ్య, జనరల్‌కెప్టెన్ ఎం శ్రీనివాస్, ఎస్‌అండ్‌పీసీ సీనియర్ ఇన్‌స్పెక్టర్లు రామిరెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు కార్మికుల సమస్యలపై ఆందోళన

శ్రీరాంపూర్, సెప్టెంబరు 4: దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గుకార్మికుల సమస్యలపై ఆందోళన చేపట్టనున్నట్లు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి పేర్కొన్నారు. బుధవారం వారు నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆందోళనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల1నుంచి 10వరకు ప్రతి బొగ్గుగని, ఓసీపీలు, డిపార్ట్‌మెంట్లలో గేట్‌మీటింగ్‌లు, 26న అన్ని జీఎంకార్యాలయాల ఎదుట భారీ నిరసన, 30న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కేంద్రకార్యదర్శి రాగం రాజేందర్, ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి మల్లయ్య, నాయకులు తిరుపతి, రామకృష్ణ, కిరణ్ కుమార్, గోళ్ల మహేందర్, రమేష్, రాజేందర్ పాల్గొన్నారు.

'వెంటనే పదోన్నతులు కల్పించాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 4: రాజకీయజోక్యంతో నిలిపివేసిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలని టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శి కె సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ చార్జ్ హ్యాండ్ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రక్రియ చేపట్టి 33మందిని ఎంపిక చేసినా ఇంతవరకు వారికి లెటర్లు ఇవ్వలేదన్నారు. అలాగే 108మంది సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టుల భర్తీకి సర్క్యులర్ ఇచ్చి మూడు నెలలైనా ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. జేఎంఈటీలుగా జాయిన్ అయి ఐదేళ్ల గడిచిన వారికి ఓవర్మెన్‌గా పదోన్నతి కల్పించాల్సి ఉండగా, ఎలాంటి లెటర్లు ఇవ్వకుండా వారిని శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ, యూనియన్ల జోక్యాన్ని నివారించి సంస్థ నియమ, నిబంధనలకు అనుగుణంగా అర్హులకు లెటర్లు అందించాలని వారు కోరారు.

శిక్షకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 4: శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వృత్తి శిక్షణకు శిక్షకుల నియామకానికి (సింగరేణి ఉద్యోగస్తుల డిపెండెంట్లు, భూ నిర్వాసితుల మహిళలు) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో కోరారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులో అనుభవం కలిగిన మహిళలు తమ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో పాటుగా రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బయోడేటాతో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పర్సనల్ విభాగంలో అందించాలని ఆయన కోరారు. కంప్యూటర్ డీటీపీ నేర్పించడానికి అర్హులైన శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.



చేరికలను నిలిపివేయాలి

- కాంగ్రెస్ నాయకుల నిరసన

కాసిపేట, సెప్టెంబరు 4: బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులను అక్రమంగా కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం కాసిపేట, బెల్లంపల్లి, తాండూర్ మండలాలకు చెందిన ఆ పార్టీ నాయకులు సోమగూడెం చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎమ్మెల్యే , ఎంపీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేశామని అన్నారు. కానీ ఇప్పుడు కొందరు బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో హైదరాబాద్‌వో చేరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పార్టీకి సేవ చేసే నాయకులు, కార్యకర్తలను నియోజకవర్గంలోనే సమావేశం ఏర్పాటుచేసి పార్టీలోకి చేర్చుకోవాలని చెప్పారు. ఎవరికి తెలియకుండా గుట్టు చప్పుడుగా హైదరాబాద్‌లో పార్టీలో చేర్చుకోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ఇతర పార్టీల నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు నియోజకవర్గంలో సమాశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల అనుమతులు తీసుకోవాలని కోరారు. లేకుంటే తీవ్ర నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తాండూర్ మండల అధ్యక్షుడు ఎండీ ఇసాక్, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు సింగతి సత్య నారాయణ, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, కాంగ్రెస్ నాయకులు మైదం రమేష్, గోలేటి స్వామి, సిరాజ్‌ఖాన్, సామ రాజిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సోమగూడెం చౌరస్తా వద్ద నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నస్పూర్, సెప్టెంబరు 4: మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం ఉదయం నస్పూర్ వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అనుమానాస్పదంగా వెళుతున్న బొలెరో ట్రాలీని ఆపి తనిఖీ చేయగా రేషన్ బియ్యం అని తేలిందని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న గుర్తించి బొలెరో ట్రాలీతో పాటు బియ్యంను స్వాధీనం చేసుకుని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన చింతల మోహన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని, నిందితుడిని సీసీసీ నస్పూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు. దాడిలో ఎస్సై లచ్చన్న, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కొమురయ్యకు ఘన నివాళి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 4: ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు మను బోతుల కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం శ్రీరాంపూర్‌లో పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలు లర్పించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య మాట్లాడుతూ కొమురయ్య సేవలు అభినందనీమని కొనియాడారు.

ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అందె మంగళప్రద

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 4 :ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అందె మంగళప్రద రెండో సారి ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో ఆమెను నియమించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఆమె ఎన్నో పోరాటాలు చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

నూతన నియామకం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 4: తెలంగాణ మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నస్పూర్‌కు చెందిన జక్కుల సాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బాధ్యతల స్వీకరణ

చెన్నూరు, సెప్టెంబరు 4: చెన్నూరు మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విద్యాసాగర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన జైపూర్ మండలంలో మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేశారు. డీఈగా పదోన్నతి పొంది చెన్నూరుకు బదిలీపై వచ్చారు. సిబ్బంది, స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ ఎస్సీ మోర్చా ప్రభారిగా జక్కుల నరహరి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 4: బీజేపీ ఎస్సీ మోర్చా మంచిర్యాల జిల్లా ప్రభారిగా గోదావరిఖనికి చెందిన బీజేపీ నాయకుడు జక్కుల నరహరిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొండ శ్రీధర్ నియామక ఉత్తర్వులు ఇచ్చారు.

బురద నీరు సరఫరా చేస్తున్న యాజమాన్యం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 4: సింగరేణి యాజమాన్యం కార్మికుల కాలనీలకు బురద నీరు సరఫరా చేస్తోందని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. దీనివల్ల కార్మికులు వ్యాధులబారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి శుద్ధికి ఉపయోగించే ఆలం అనే పదార్థం కోసం నెలకు లక్ష రూపాయలు విడుదల అవుతున్నాయని, ఓల్డ్ వెల్ రెండేళ్లుగా బంద్ చేయడంతో ఆ డబ్బును ఏం చేస్తున్నారో తెలియడం లేదని తెలిపారు. ఓల్డ్ వెల్‌ను పునరుద్ధరించి శుభ్రమైన నీటిని అందించాలని వారు కోరారు.

కార్మికవాడలపై సింగరేణి చిన్నచూపు


జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు(ఫైల్)

రెబ్బెన, సెప్టెంబరు 4: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్ షిప్‌లోని కార్మికవాడలపై సింగరేణి యాజమాన్యం చిన్నచూపు చూస్తోందని కార్మికులతోపాటు వారి కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా కార్మికుల కాలనీలకు అపరిశుభ్రమైన నీరు సరఫరా చేస్తున్నారని తద్వారా తాము అనారోగ్యంబారిన పడుతున్నామని పలువురు కార్మికులు తెలిపారు. సింగరేణి పైపులైన్ల ద్వారా వస్తున్న నీరు శిలుముతోపాటు మురికివస్తోందని వివరించారు. ఈ విషయమై సింగరేణి యాజమాన్యానికి ఎన్నిసార్లు చెప్పినా ఇంత వరకు సమస్య పట్టించు కోవటం లేదని తెలిపారు. ఇటీవల కొందరు బీజేపీ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు కూడా అందజేశారు. కార్మికవాడల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, రోడ్లపైనే తిష్టవేస్తున్నాయని కార్మికులు పేర్కొంటు న్నారు. రాత్రిళ్ల విధులు నిర్వహించేందుకు వెళ్లాలంటే ఆందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా ప్రతిగురువారం నిర్వహించే వారసంతలో సరైనసౌకర్యాలు లేకపోవటంతో చిరువ్యాపారస్థులు, కొనుగోలుదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గోలేటి క్రాస్ రోడ్డు వద్ద బస్టాండు నిర్మించాలని కార్మికులతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇక్కడ ఉన్న బస్టాండ్ రోడ్డు వెడల్పులో పూర్తిగా పోయిందన్నారు. ప్రస్తుతం నిలువ నీడ లేని పరిస్థితి ఉందని కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయమై జీఎం శ్రీనివాస్‌ను వివరణ కోరగా గోలేటి టౌన్‌షిప్‌లోని కార్మికవాడలకు వస్తున్న నీరు అపరిశుభ్రంగా ఉన్నట్టు తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి మిషన్‌భగీరథ నీరు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.


మంచినీటిని సరఫరా చేయాలి..
-కేసరి అంజనేయులు గౌడ్, గోలేటి టౌన్‌షిప్



గోలేటి టౌన్‌షిప్‌లో మంచినీటి సరఫరా అపరిశుభ్రంగా ఉంది. కార్మికవాడలకు ప్రస్తుతం యాజమాన్యం సరఫరా చేస్తున్న నీరు అపరి శుభ్రంగా ఉంది. అధికారులు స్పందించి శుభ్రమైన తాగునీరందిచేలా చూడాలి.

ప్రమోషన్ల విషయంలో అన్యాయం జరిగింది: ఏఐటీయూసీ

రెబ్బెన, సెప్టెంబరు 4: బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ జీఎం శంకర్‌నాయక్‌కు బుధవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఈపీఆపరేటర్లకు ప్రమోషన్ల విషయంలో అన్యాయం జరిగిందన్నారు. వేకెన్సీతో నిమిత్తం లేకుండా అందరికీ టైంబాండ్‌ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి జూపాకరాజేష్, కార్యదర్శిపుట్ట అంజయ్య, నరేష్, ఇక్బాల్, ఆపరేటర్స్ పాల్గొన్నారు.







అసత్య ఆరోపణలు చేస్తే సహించం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 4: మంచిర్యాల- ఆర్మూర్ జాతీయ రహదారి 63 విస్తరణ అలైన్‌మెంట్ విషయంలో తనపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారి 63ను తాను రాజకీ యాల్లోకి రాకముందే 2018లోనే ప్రధాని మోదీ మొదటి ప్రభుత్వంలో మొదటిసారి అలైన్‌మెంట్ ఖరారైందని తెలిపారు. 2018 చివరలో తాను రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. అనంతరం 2023లో రెండో అలైన్‌మెంట్ విషయంలో ప్రధాని మోదీ ప్రభుత్వం రెండోసారి ఖరారు చేసిన అలైన్‌మెంట్‌లో లక్షెట్టిపేట పట్టణం నుంచి రహదారి విస్తరణ చేయాలని ఖరారు చేశారని చెప్పారు. దీని వల్ల మున్సిపాలిటీలో ట్రాఫిక్ సమస్య , ప్రమాదాలు జరుగుతాయనే ఉద్దేశ్యంతో లక్షెట్టిపేట పట్టంలోని రాజకీయ నాయకులతో కలిసి తాను, ప్రస్తుత చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామితో కలిసి కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గ్కడరీని కలిసి సమస్యను వివరించామని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణను లక్షెట్టిపేట మున్సిపాలిటీ నుంచి కాకుండా పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరామని వివరించారు. 2024లో ఎన్‌హెచ్‌ఏఐ మరో అలైన్‌మెంట్ ప్రతిపాదించిందన్నారు. లక్షెట్టిపేట మండలం , హాజీపూర్ మండలాల్లో పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి అవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గతంలో ఇక్కడి రైతులు ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయారని ఈ ఏడాది జూలైలో మాజీ ఎంపీ వెంకటేష్ నేతతో కలిసి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి విన్నవించినట్లు తెలిపారు. రైతులు, ప్రజల సంక్షేమం కోసం బీజేపీ చిత్తశుద్ధితో పనిచేస్తుం దన్నారు. కొందరు రాజకీయ బ్రోకర్లు అలైన్‌మెంట్ మార్పులో తనపై



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకున్నానని తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నానని తెలిపారు. సమావేశంలో నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, గుంబ ప్రభాకర్, జోగు శ్రీదేవి, కిషన్, స్వామిరెడ్డి, లచ్చన్న, నాగేశ్వర్‌రావు, జయరాంరావు, మల్లేష్, వెంకటరమణ రావు, ప్రవీణ్, అశ్విన్, రామన్న, శ్రీశైలం, సతీష్, శివకృష్ణ, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

హాజీపూర్, సెప్టెంబరు 4: వర్షాల నేపథ్యంలో మండలంలోని వేంపల్లి గ్రామంలోని లోతట్టు ప్రాంతాలైన మేకల మండి, మంచిర్యాల గార్డెన్స్ దగ్గర గల ఒర్రెను బుధవారం మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రావుదేశ్‌పాండే, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఎస్‌ఐ సురేష్, ఎంపీడీవో మధుసూదన్‌లు పరిశీలించారు. ఒర్రె ప్రవాహం వల్ల ఇబ్బందులను స్థానిక ఇండ్ల యాజమానులను అడిగి తెలుసుకున్నారు. ఒర్రె ఉధృతి ఎక్కువగా ఉంటే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. వర్షాల వల్ల ఏదైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ధర్మారం గ్రామంలోని ధర్మారం చెరువు వద్ద లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 4: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ 1, కామర్స్ టాక్సేషన్ 1, బాటనీ 1, జువాలజీ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. పీహెచ్‌డీ లేకపోతే నెట్ అర్హత గల వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నెల 6వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, 9న డెమో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటం

జన్నారం, సెప్టెంబరు 4 : ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తుందని పార్టీమండల కన్వీనర్ మామిడి విజయ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు పార్టీలో చేరగా బుధవారం మండల కేంద్రంలో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కోటేష్, శంకర్, బచ్చిరాజం తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా దీపేష్ రెన్వా

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 4: హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడిగా దీపేష్ రెన్వాను బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సంఘం సంచాలకులు బద్రినారాయణ, చంద్రశేఖర్, కృష్ణభాస్కర్, నర్సయ్య నూతన అధ్యక్షుడిగా దీపేష్ రెన్వాను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రవీందర్ ఎన్నికయ్యారు.

రాంపూర్‌లో పారిశుధ్య పనులు చేపట్టాలి

కాసిపేట, సెప్టెంబరు 4: వర్షాకాలంలో గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయిన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, వెంటనే రాంపూర్ గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టాలని స్థానికులుడ బుధవారం దేవాపూర్ పంచాయతీ కార్యదర్శి కవి తకు వినతి పత్రం అందించారు. గ్రామపటేల్ జుగునక అచ్యుత్‌రావు మాట్లాడుతూ గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోవడమే కాకుండా డ్రైనేజీలు నిం డి మురుగు నీరు ఇళ్లల్లోకి చేరుతుందన్నారు. దీంతో రోగాల బారిన పడుతు న్నామన్నారు. కార్యక్రమంలో సిడాం శంకర్, మరప రాము, మడావి లచ్చు, టేకం రామకృష్ణ, మడావి తరుణ్, శ్యాంరావు, మాధవరావు, అరుణ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నియామకం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 4: మందమర్రి ఏరియా సింగరేణి స్పోర్ట్స్ కో ఆర్డినేటర్‌గా స్థానిక కేకే 5 గనిలో మైనింగ్ సర్దార్‌గా పనిచేస్తున్న సాయికృష్ణను నియమిస్తూ యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కాగా ఏరియాలోని ఆయా క్రీడల కెప్టెన్‌లను నియమిం చింది. జనరల్ కెప్టెన్‌గా శ్రీనివాస్, ఇండోర్ కెప్టెన్‌గా ఓం నారాయణ, ఫుట్‌బాల్ కెప్టెన్‌గా శివకుమార్, వాలీబాల్ కెప్టెన్‌గా రాములు, బాస్కెట్‌బాల్ కెప్టెన్‌గా మనోహర్, హాకీ కెప్టెన్‌గా కృష్ణ, కబడ్డీ కెప్టెన్‌గా రవికుమార్, బాల్‌బ్యాడ్మింటన్ కెప్టెన్‌గా బానయ్య,బాడీ బిల్డింగ్,పవర్, వెయిట్ లిఫ్టింగ్ కెప్టెన్‌గా వెంకటేశ్వర్లు, టెన్నిస్ కెప్టెన్‌గా కృష్ణ, క్రికెట్ కెప్టెన్‌గా క్రాంతికుమార్, అథ్లెటిక్స్ కెప్టెన్‌గా రమేష్, షటిల్ బ్యాడ్మింటన్ కెప్టెన్‌గా చిన్నయ్య,చెస్ కెప్టెన్‌గా సుధాకర్, క్యారమ్స్ కెప్టెన్‌గామోసిన్ ఆలీ,టేబుల్ టెన్నిస్ వెంకటేశ్వర్లు, కల్చరల్ కెప్టెన్‌గా డేవిడ్‌సన్ , స్విమ్మింగ్ కెప్టెన్‌గా వెంకటేశ్వర్లు, ఉమెన్‌రెప్రజెంటేటివ్ విమలకుమారిలను నియమించారు.

విద్యుదాఘాతంతో పశువులు మృతి

కోటపల్లి, సెప్టెంబరు 4: మండలంలోని సర్వాయిపేట, సిర్సా గ్రామాల్లో బుధవారం విద్యుదాఘాతంతో గేదె, ఎద్దు మృతిచెందాయి. మండలంలోని సర్వాయిపేట గ్రామంలోని కొత్తగూడెం కాలనీలో ఈర్ల కుమార్ అనే వ్యక్తికి చెందిన గేదె ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తాకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎర్త్ తీగకు కరెంటు సరఫరా కావడంతో గేదె మృతిచెందినట్లు యాజమాని కుమార్ తెలిపారు. మరో వైపు సిర్సా గ్రామంలో పెద్దింటి పున్నంచంద్ అనే రైతుకు చెందిన ఎద్దు పొలంలో మేత మేస్తుండగా అక్కడ రైతులు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ సరఫరా జరిగి ఎద్దు మృతిచెందినట్లు బాధిత రైతు తెలిపాడు. కాగా మృతిచెందిన ఎద్దు విలువ రూ. 60 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

'దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి'

కోటపల్లి, సెప్టెంబరు 4: ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో గిరిజన ఆదివాసీ మహిళపై దాడి చేసిన ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని లంబాడీల ఐక్యవే దిక నాయకులు సమ్మయ్యనాయక్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సదరు మహిళకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

చెన్నూరు, సెప్టెంబరు 4: చెన్నూరు పట్టణంలో బుధవారం ట్రస్మా ఆధ్వర్యంలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించి చెన్నూరు, భీమారం, కోటపల్లి, జైపూర్, వేమనపల్లి మండలాలకు చెందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మూల రాజిరెడ్డి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, ఎంఈవో రాధాకృష్ణ, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఉపాధ్యక్షుడు రాజేంద్రపాణి, ఫయాజ్, జుల్ఫికర్, మండల అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఖాజాఖంరొద్దీన్, ప్రవీణ్, జగన్‌మోహన్‌రెడ్డి, అలీ, జలాల్, శ్రావణ్, మణికందన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

జన్నారం, సెప్టెంబరు 4: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ నర్సింహులు, నాయకులు నర్సయ్య, భాస్కర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, సత్తన్న, శ్రీధర్, నర్సగౌడ్, మల్లయ్య, మహేష్, శంకర్, శ్రీనివాస్, మలేష్లష్, సంతోష్, అశోక్, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

ఇబ్బందులు ఉంటే సమాచారం అందించాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 4: వర్షాలు కురుస్తున్న దృష్ట్యా వరదలు , ఇతర ఇబ్బందులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. బుధ వారం ఆయన మాట్లాడుతూ మందమర్రిలోని చెరువులు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించా మన్నారు. ప్రజలకు వర్షాలతో ఇబ్బందులు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. మందమర్రి మార్కెట్ సెంటర్‌లో రోడ్లపై గుంతలు పడ్డాయని వాటిని పూడ్చేలా మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్నామని తెలిపారు. ప్రజలు అవసరం ఉంటేనే బయటకు రావాలని సూచించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందన

కోటపల్లి, సెప్టెంబరు 4 : మండలంలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయన శాస్త్రం ఉపాధ్యాయుడు శనిగారపు సురేందర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక వడంతో బుధవారం పలువురు అభినందించారు. భౌతిక రసాయన శాస్త్రాన్ని బోధిస్తూ పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ విద్యార్థులను చిన్నారి శాస్త్రవేత్తలుగా తయారు చేయడంలో ఈ ఉపాధ్యాయుడు తనదైన ముద్రవేశాడు. యేటా పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలతో పాటు ఇన్‌స్పైర్ మనక్ అవార్డు, జవహర్ లాల్ నెహ్రూ సైన్స్ అండ్ మ్యాథమేటిక్స్ ఎన్విరాన్‌మెంట్ ఎగ్జిబిషన్, ఇంటింటా ఇన్నోవేటర్ అవార్డు వంటి కార్యక్రమాల్లో పాల్గొన్న ఈ ఉపాధ్యాయుడు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ అవా ర్డులను అందుకున్నారు.

ఉపాధిహామీ పనులు వంద శాతం పూర్తి చేయాలి

మందమర్రిరూరల్, సెప్టెంబరు 4: ఉపాధిహామీ పనులను వంద శాతం పూర్తయ్యే విధంగా కృషి చేయాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధిహా మీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులను ఎంపిక చేయాలని సూచించారు. అనంతరం స్త్రీశక్తి క్యాంటీన్ కోసం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీవో రజియాసుల్తానా, ఏపీఎం లితకుమారి, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పశువుల కొట్టం దగ్ధం

బెల్లంపల్లి(తాండూర్), సెప్టెంబరు 4: మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తూ పశువుల కొట్టం కాలిపోయింది. వల్లూరి రాజేశ్వర్ ఇంటి ఆవరణలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పశువుల కొట్టంలో దోమలు రాకుండా ఉండేందుకు మస్కిటో కాయిల్ పెట్టి నిద్రించాడు. పశువుల కొట్టంలో గడ్డి ఉండడంతో ప్రమాదవశాత్తూ గడ్డికి మంటలు అంటుకుని చెలరేగాయి. దీంతో కొట్టంలో ఉన్న మూడు ఆవులు పారిపోగా, చిన్న లేగదూడ తాడుతో కట్టి ఉంచ డంతో మంటలు అంటుకుని సజీవదహనం అయింది. మరో లేగ దూడకు సైతం మంటలు అంటుకుని గాయాల య్యాయి.

ఎలుగుంటి దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

హాజీపూర్, సెప్టెంబరు 4: మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన జగన్నాథుల నాగరాజు అనే వ్యక్తి బుధవారం ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. నాగరాజు కూలీ పనులు చేసేవాడు. ఈ క్రమంలో ఉదయం గుడిపేట శివారులోని అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లాడు. కట్టెలు కొడుతుండగా ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసింది. దీంతో నాగరాజు తలపై, కళ్లపై తీవ్ర గాయాలయ్యాయి. ఎలుగుబంటి దాడి నుంచి తప్పించుకుని పరిగెత్తుకుంటూ గ్రామంలోకి వచ్చాడు. స్థానికులు వెంటనే నాగరాజును మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 4: జిల్లాలో పండుగలను మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీసీపీ బాస్కర్, మంచిర్యాల,బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగలను మాత సామరస్యంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. శాంతి కమిటీ సభ్యులు పండుగల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేయాలన్నారు. వినాయక చవితి మండపాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మండపాల నిర్వహణ కోసం విద్యుత్, పోలీసు, మున్సిపల్, మండల అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. నిమజ్జనం రోజున వాహనాలు నడిపే రూట్‌మాప్‌ను అన్ని శాఖల అధికారులకు అందించనున్నామని చెప్పారు. ఈ రూట్లలో అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో నిమజ్జనం కోసం లక్షెట్టిపేట మండలంలోని రాయపట్నం, మంచిర్యాలలోని గౌతమేశ్వర ఆలయం, సీతారాంపల్లి, ఇందారం, చెన్నూరులోని పెద్ద చెరువులు, బెల్లంపల్లిలోని పోచమ్మ గుడి ప్రాంతాల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. నిమజ్జనం సందర్భంగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ప్రజలందరు శాంతియుతంగా పండగలను జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జైనూర్‌లో 144సెక్షన్ అమలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 4: జైనూర్‌లో బుధవారం ఆదివాసీలు తలపెట్టినబంద్ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసులు144సెక్షన్ విధించారు. ఆసిఫాబాద్‌జిల్లా పోలీసులతోపాటు ఇతర జిల్లాల పోలీసులు, స్పెషల్‌పార్టీ ప్లాటున్‌ల నుంచి వెయ్యిమంది అదనపుబలగాలను మోహరించారు. జైనూరు ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు పరిస్థితులను. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే పోస్టులను ప్రసారంచేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరికలు జారీ చేశారు.

వరద ప్రవాహాన్ని పరిశీలించిన జడ్పీ మాజీ చైర్మన్

సిర్పూర్(టి), సెప్టెంబరు 4: మండలంలోని పారిగాం గ్రామసమీపంలోని పారిగాం వాగు వరద ప్రవాహాన్ని జడ్పీ మాజీచైర్మన్ కోనేరుకృష్ణారావు పరిశీలించారు. నియోజకవర్గంలో ఆయామండలాల్లో పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

టీకాలు సకాలంలో వేయించుకోవాలి

వాంకిడి, సెప్టెంబరు 4: వ్యాధినివారణ టీకాలను సకాలంలో వేయించుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి రవిదాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బెండార, ఖిరిడి గ్రామల్లో వ్యాధినివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతినెల పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని, గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా, వారిని వారం రోజుల ముందే ఆసుపత్రికి తీసుకురావాలని అప్పుడే తల్లీ,బిడ్డ సురక్షితంగా ఉంటారని పేర్కొన్నారు. వర్షాకాలంలో గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, సిబ్బంది స్వప్న, మమత, క్రిష్ణ కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తాం : ఎస్‌ఈ

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 4: జిల్లాలో అత్యుత్తమ సాంకేతికతతో వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరాచేస్తామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ వాసుదేవ్ ఒకప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక పద్ధతులు అవలంభిస్తున్నామన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

దహెగాం, సెప్టెంబరు 4: అంగన్‌వాడీకేంద్రాలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని మండల ప్రత్యేకాధికారి సజీవన్ అన్నారు. బుధవారం దహెగాం మండలం చిన్న అయినం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మెనూప్రకారం భోజనం అందించాలన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

కౌటాల, సెప్టెంబరు 4: నాణ్యమైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంనాయక్ అన్నారు. బుధవారం కౌటాలపీహెచ్‌సీని ఆకస్మికంగాతనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిపరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చేవారికి ఎల్లప్పుడు అందుబాటులోఉండి నాణ్యమైన వైద్యం అందించాలని పేర్కొన్నారు.

మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ

రెబ్బెన, సెప్టెంబరు 4: ఈనెల 6న గోలేటి డిస్పెన్సరీ పక్కన బస్‌షెల్టర్‌వద్ద సింగరేణి పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను జీఎం శ్రీనివాస్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు డీజీఎం పర్సనల్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు అంతా కృషిచేయాలని ఆయన కోరారు.

బ్యూటీషియన్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 4: ప్రభుత్వం మహిళా, సంక్షేమశాఖ ద్వారా జిల్లా మహిళాసాధికారత కేంద్రం సహకారంతో అందిస్తున్న బ్యూటీషియన్ కోర్సులను విద్యార్థినులు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖాధికారి భాస్కర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి బ్యూటీషియన్ కోర్సులు పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్నటైలరింగ్, బ్యూటీషియన్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం కాగజ్‌నగర్‌లోని డిగ్రీకళాశాల, బెండారలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 45రోజుల బ్యూటిషియన్ కోర్సు పూర్తి చేసిన 93మందికి డిగ్రీకళాశాల విద్యార్థినులకు ధ్రుపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, సీడీపీవోలు, మహిళాసాధికారత కేంద్రం సిబ్బంది, శిక్షకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 4: హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జైనూరు మండలానికి చెందిన ఆదివాసీ మహిళను బుధవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమెఆరోగ్యపరిస్థితి అందుతున్న చికిత్సను అడిగి తెలుసుకున్నారు. అఘాయిత్యానికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు ఆదివాసులపై పునరావృతం కాకుండా ప్రభుత్వం దృష్టి సారించాలని బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

దహెగాం, సెప్టెంబరు 4: మండలంలోని ఖర్జి గ్రామానికి చెందిన రౌతు శంకర్ మృతిచెందడంతో బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ధనుంజయ్, బక్కన్న, సంజీవ్, మల్లాగౌడ్ తదితరులు న్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

పెద్దవాగు బ్రిడ్జికి పొంచి ఉన్న ముప్పు





↑ బ్రిడ్జి దెబ్బతిని పైకి కనిపిస్తున్న ఇనుప చువ్వలు

← పగుళ్లు బారిన సైడ్ వాల్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 4: కాగజ్‌నగర్ సమీపంలోని పెద్ద వాగు బ్రిడ్జి ప్రమాదకరంగా మారుతోంది. బ్రిడ్జికి ఉండే సైడ్ వాల్స్‌కు పగుళ్లు ఏర్పాడ్డయి. బ్రిడ్జిపై నుంచి భారీ వాహనాలు వెళుతున్నప్పుడు కంపిస్తోంది. పెద్దవాగుపై 35ఏళ్ల క్రితం ఈ వంతెన నిర్మించారు. బ్రిడ్జిపై గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ఈ బ్రిడ్జి పైనుంచి 500 వరకు బస్సులు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. బ్రిడ్జి పరిస్థితి అధ్వానంగా తయారు కావడంతో మరమ్మతులు చేయించాలని లేదా కొత్తబ్రిడ్జి నిర్మించాలని ఆయా మండలాల ప్రజలు పేర్కొంటున్నారు.

త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం..
-లక్ష్మీనారాయణ, డీఈ, ఆర్అండ్‌బీ

పెద్దవాగు వంతెనపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలకు త్వరలోనే మరమ్మతుల చేయిస్తాం. అలాగే పగుళ్లు తేలిన చోట మరమ్మతులు చేయిస్తాం. బ్రిడ్జికి ఇంకా కాలపరిమితి ముగియలేదు.

వెంకట్రావుపేట గ్రామాన్ని సందర్శించిన అధికారులు

సిర్పూర్(టి), సెప్టెంబరు 4: మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో విద్యార్థిని గంగోత్రి జ్వరంతో మృతిచెందడంతో బుధవారం గ్రామాన్ని డీఎంహెచ్‌వో తుకారాంబట్, డీపీవో భిక్షపతి సందర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె మృతికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే గ్రామంలో మూడురోజుల పాటు వైద్యశిబిరం నిర్వహించి 50 మంది నుంచి రక్తనమునాలు సేకరించి జిల్లా కేంద్రానికి పంపిస్తామన్నారు. గంగోత్రికి రక్తహీనత (సికిల్ సెల్ ఎనిమియా) ఎక్కువగా ఉందని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, మూఢనమ్మకాలను నమ్మవద్దని, జ్వరం వస్తే ఆసుపత్రికి రావాలన్నారు. ప్రస్తుతం గ్రామంలో కాస్త వైరల్ జ్వరాలు ఉన్నట్లు తెలిపారు.

డీపీవో భిక్షపతి మాట్లాడుతూ పారిశుధ్యం, మంచినీరు తదితర వాటిపై దృష్టి సారించాలన్నారు. అధికారులు హెడ్‌క్వార్టర్లలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో గంగోత్రి చదువుతున్న పాఠశాలను సందర్శించి వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీడీవో సత్యనారాయణ, డాక్టర్ నవత, సిబ్బంది నర్సయ్య, ఎంఈవో భిక్షపతి, ప్రధానోపాధ్యాయుడు సదాశివ్, సీఆర్పీ పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 4: ఈనెల 6నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని నిమజ్జనోత్సవం చేసే స్థానిక పెద్దవాగు పరిసరప్రాంతాన్ని బుధవారం మున్సిపల్‌కమిషనర్ భుజంగరావు, డీఈఈ మసూద్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణేష్ విగ్రహాలను నిమజ్జనోత్సవానికి తీసుకువచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పెద్దవాగు పరిసర ప్రాంతాలతో పాటు పట్టణంలో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు.

ఎంఈవో సోమయ్య సేవలు మరువలేనివి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య

కౌటాల, సెప్టెంబరు 4: కౌటాల ఎంఈవో సోమయ్య సేవలు మరువలేనివని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య అన్నారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బదిలీపై ఆదిలాబాద్‌కు వెళ్తున్న సోమయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎంఈవో సోమయ్య 20సంవత్సరాలు కౌటాల, చింలమానేపల్లి, సిర్పూర్(టి) మండలాలకు ఎనలేనిసేవలు అందించారని, ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే ఏకైకరెగ్యులర్ ఎంఈవోగా పనిచేస్తూ అందరిమన్ననలను పొందారన్నారు. ఎన్ని మండలాలకు ఇన్‌చార్జి ఇచ్చినా ఓపికగా పనిచేశారన్నారు. మారుమూల ప్రాంతమైన కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు, సిర్పూర్(టి)లలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషిచేశారన్నారు. ఉపాధ్యాయులను కూడా సున్నితంగా మందలిస్తూ పాఠశాలలు సక్రమంగా నడిచేలా చూశారన్నారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు కిషన్‌రావు, ఇన్‌చార్జి ఎంఈవో రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సైలను సన్మానించిన నాయకులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 4: కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సైలు రమేష్, సుధాకర్‌ను బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎం జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, వైఎస్ఆర్ మూర్తి, నర్సయ్య, అన్వర్, ఎం సుభాష్, పురుషోత్తం కుమార్, సీతారం, యు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సైలను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కరెంటు రావాలంటే సాహసం చేయాల్సిందే

కౌటాల, సెప్టెంబరు 4: మండల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలంటే సిబ్బంది సాహసం చేయాల్సిన పరిస్థితినెలకొన్నది. మండల కేంద్రంలో ఒక ప్రాంతానికి విద్యుత్ సరఫరాచేసే ట్రాన్స్‌ఫార్మర్ చెరువు నీటిలో ఉండడంతో విద్యుత్‌సరఫరాలో అసౌకర్యం కలిగితే సిబ్బంది ఇబ్బంది పడుతూ మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి. గతంలో చెరువు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ప్రతివర్షాకాలం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు నీరుచేరు తోంది. దీంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏదైనా సమస్య తలెత్తితే సిబ్బంది నీటిలోకి వెళ్లి మరమ్మతులు చేయాల్సి వస్తోంది. రాత్రి సమయంలో అంతరాయం కలిగితే ఇక అంతే సంగతులు. ఇటీవల విద్యుత్‌సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం అధికారులకు తెలియజేయడంతో వారు నీటిలోకి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేశారు. ఇప్పటికైనా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటికి మార్చాలని వినియోగదారులు కోరుతున్నారు.



చెరువునీటిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం

జైపూర్, సెప్టెంబరు 4 : జైపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర కళాశా ల (కోటపల్లి)లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లభర్తీ చేయడానికి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో ఎస్సీ 5, మైనార్టీ 1, ఎస్సీ (సీ) 1, ఓసీ 1, మొత్తం 8 ఖాళీలు ఉన్నాయని పేర్కొ న్నారు. కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ గ్రూపులో ఎస్సీ 7, ఎస్సీ(సీ) 1, ఎస్టీ 1, మైనార్టీ 1, ఓసీ 1, మొత్తం 11 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వివరాల కోసం 7995010570, 9948480223లో సంప్రదించాలని సూచించారు.

అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తే చర్యలు

మంచిర్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లే అవుట్ అనుమతుల్లేని వెంచర్లలోని ప్లాట్లను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసే సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకుంటామని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కరీంనగర్ డీఐజీ రవీందర్ స్పష్టం చేశారు. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ గుంటల విషయానికి వస్తే డాక్యుమెంట్ టూ డాక్యుమెంటు రిజిస్ట్రేషన్ చేసే వెసులుబాటు ఉందని తెలిపారు. అంతేగానీ లే అవుట్ అనుమతుల్లేని వెంచర్లలో ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఒకవేళ లింక్ డాక్యుమెంట్ ఉండి చదరపు గజాల్లో ఉన్న స్థలాన్ని బిట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేసే వెసులుబాటు కూడా ఉన్నట్లు తెలిపారు. అయితే 2018 పంచాయతీరాజ్ చట్టం, 2019 మున్సిపల్ యాక్టు ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా అక్రమ వెంచర్లలోని ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు పత్రికా కథనాల ద్వారా తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ విషయమై విచారణ జరిపేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్లపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమాలను అరికట్టేందుకే మంచిర్యాలకు శాశ్వత మహిళా సబ్ రిజిస్ట్రార్‌ను నియమించామని, నవంబరు నుంచి పూర్తిస్థాయిలో ఆమె విధులు నిర్వహిస్తారని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లకు ప్రభుత్వ పరంగా లైసెన్సులు జారీ చేయలేదని తెలిపారు. ఈ కారణంగా డాక్యుమెంట్ అధికారికంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వచ్చేందుకు అనుమతి లేదన్నారు. వినియోగదారులు నేరుగా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సంధాని

నస్పూర్, సెప్టెంబరు 4: తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళ చట్టాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎండీ సంధాని, సహాయ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్ఆర్ రాములు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అనేక చట్టాలున్నాయని, మనకు ఉపయోగపడే వాటి గురించి తెలుసుకుని నడుచుకోవాలన్నారు. చాలా అత్యాచార కేసులు నమోదు అవుతున్నయని, చట్టాలను కఠినంగా అమలు చేస్తే నేరాలు తగ్గుతాయన్నారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మహిళలకు అండగా నిలుస్తున్నయని, వారి ద్వారా సాధికారతకు దోహద పడుతాయన్నారు. సదస్సులో ప్రధానోపాధ్యాయుడు రామన్న పాల్గొన్నారు.

హైడ్రా గుబులు

- హైదరాబాద్ తరహా కమిటీలకు ప్రభుత్వం సన్నాహం
- జిల్లాలో పదుల సంఖ్యలో చెరువులు, కుంటలు కబ్జా
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన భవనాలు
- కాంగ్రెస్ సర్కారు నిర్ణయంతో కబ్జాదారుల్లో ఆందోళన


బెల్లంపల్లి ఎర్రకుంట చెరువులో వెలిసిన వెంచర్ రోడ్డు

మంచిర్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో సైతం హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్) కమిటీలను వేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రక టించడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. జిల్లాలో జల వనరులను ఆక్రమించి నిర్మించిన పలు వెంచర్లు, ఇళ్లకు అనుమతులు ఇవ్వడం సంచలనంగా మారింది. నీటిపారుదల శాఖ అధికారులు సైతం పలుచోట్లా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయి. ఇక మున్సిపాలిటీలు, గ్రామాల్లోనూ ఎన్‌వోసీలు ఇవ్వడంతో దర్జాగా అక్రమ కట్టడాలు చేపట్టారు. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్టీఎల్), చెరువు శిఖం, బఫర్ జోన్ల పరిధిలో యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టిన దృశ్యాలు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి. వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగుల్లోకి చేరాల్సిన వరదనీరు కాలనీలు, రహదారులపై ప్రవహిస్తోంది. హైడ్రా విభాగాన్ని జిల్లాలో విస్తరిస్తే ఈ అక్రమాల బాగోతం బయటపడే అవకాశాలు ఉన్నాయి.


కబ్జాకు గురైన జిల్లా కేంద్రంలోని రాముని చెరువు

జిల్లాలో 840 చెరువులు..

మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలో మొత్తం 840 చెరువులు ఉన్నాయి. మంచిర్యాల నియోజక వర్గంలో 99 చెరువులు, కుంటలు ఉండగా, చెన్నూరు నియోజకవర్గంలో 625, బెల్లంపల్లి నియోజక వర్గంలో 215 ఉన్నాయి. వాటిలో చాలా వరకు కబ్జా కోరల్లో మగ్గుతున్నాయి. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోగల సర్వే నంబర్ 45లో ఎర్రకుంట చెరువు శిఖం భూమి కబ్జాకు గురైంది. 11 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సి ఉండగా సగాని కిపైగా కబ్జా అయింది. పక్కనే రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేసిన వ్యాపారులు శిఖం భూముల్లో రోడ్లు వేసి, విక్రయాలకు పాల్పడ్డారు.

చెన్నూరులోని కుమ్మరికుంట చెరువు 971 సర్వే నంబర్‌లో 16.24 ఎకరాల్లో విస్తరించి ఉంది. విచ్చలవిడి కబ్జాల కారణంగా ప్రస్తుతం రెండు ఎకరాలకే పరిమితమైంది. చెరువు భూముల్లో పెద్ద భవనాలు వెలిశాయి. మండలంలోని ఎల్లక్కపేట చెరువు సర్వే నంబర్ 187లో 39.23 ఎకరాల్లో విస్తరించి ఉండేది. ప్రస్తుతం చెరువు భూములు 10 ఎకరాల మేర కబ్జాకు గురైంది. జన్నారం మండలంలోని కిష్టాపూర్ ఊర చెరువును ఇద్దరు బీఆర్ఎస్ నాయకులు 8.13 ఎకరాలకు అక్రమంగా పట్టాలు సృష్టించుకున్నారు. మత్స్యకారుల ఆందోళనతో చెరువుకు హద్దులు ఏర్పాటు చేసినప్పటికీ అక్రమ పట్టాలు రద్దు చేయలేదు. మందమర్రి మండలం చిర్రకుంటలోని లోత్రాై చెరువు, ఆదిల్‌పేటలోని ఎర్ర చెరువులు కొంతభాగం కబ్జాలకు గురైనట్లు ఆరోపణలున్నాయి. భీమారం మండల కేంద్రంలోని సర్వే నంబర్ 570లో 14.39 ఎకరాల విస్తీర్ణంలో ఊర చెరువు ఉంది. ఇందులో ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న 6.29 ఎకరాల్లో పక్కా భవనాలు వెలిశాయి. మిగతా కొంత భూమిలో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేశారు. గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ జాయింట్ సర్వే నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు హద్దులు ఏర్పాటు చేయలేదు.

జిల్లా కేంద్రంలోనూ..

జిల్లా కేంద్రంలో ఎనిమిది చెరువులు, కుంటలు ఉన్నాయి. వాటిలో రాముని చెరువు, పోచ మ్మ చెరువు, సాయికుంట, చీకటి వెలుగుల కుంటలు పెద్ద మొత్తంలో కబ్జాలకు గురయ్యాయి. రాముని చెరువును ఆనుకొని బడా వెంచర్ ఏర్పాటు చేయగా, బహుళ అంత స్థుల భవ నాలు వెలిశాయి. రాముని చెరువుకు గతంలో హద్దు లు ఏర్పాటు చేసినప్పటికీ శిఖం భూముల్లో వెలిసిన భవనాలపై చర్యలు తీసుకోలేదు. మంచిర్యాల శివారు సర్వే నంబర్ 406లో 47. 32 ఎకరాల్లో రాముని చెరువు విస్తరించి ఉంది. 37 ఎకరాల మేర శిఖం భూములున్నాయి. మంచిర్యాల శివారు సర్వే నంబర్ 406లో 47. 32 ఎకరాల్లో రాముని చెరువు విస్తరించి ఉండగా, 37 ఎకరాల మేర శిఖం భూములు ఉన్నాయి. చెరువు సుందరీకరణ జరుగుతున్న సమయంలో గతంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్ తొలగించి మరీ స్థలం కబ్జా చేశారు. అలాగే పోచమ్మ చెరువులో సింహభాగం కబ్జాలకు గురైంది. 20 ఎకరాల పై చిలుకు విస్తీర్ణం ఉన్న చెరువు చుట్టూ ఎఫ్టీఎల్ (ఫుల్ టాంక్ లెవల్) పరిధిలో బహుళ అంతస్థుల భవనాల నిర్మాణం జరుగగా, బఫర్ జోన్లలో కూడా అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ సమీపంలో రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న చీకటి వెలుగుల కుంట దాదాపుగా కనుమరుగైంది. చెరువు చుట్టూ ఇళ్లు ఉండడం, మరోవైపు బడా వెంచర్ ఏర్పాటు కావడంతో చీకటి వెలుగులకుంటను గుట్టు చప్పుడు కాకుండా మింగేశారు. సాయికుంట చెరువులోనూ అక్రమ కట్టడాలు వందల సంఖ్యలో వెలిశాయి. ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు వెలిసినా అడిగేవారు కరువయ్యారు.


భీమారం ఊర చెరువు శిఖంలో వెలిసిన భవనాలు


కబ్జాకు గురైన చెన్నూరు కుమ్మరికుంట చెరువు

పలు చోట్ల భారీ వర్షం

- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద
- జిల్లా కేంద్రంలో ఉధృతంగా రాళ్లవాగు ప్రవాహం
- భయాందోళనలో లోతట్టు ప్రాంతాల ప్రజలు


జిల్లా కేంద్రంలోని బృందావన్‌కాలనీలో నిలిచిన వరదనీరు


జిల్లా కేంద్రంలో వంతెనపై నుంచి ప్రవహిస్తున్న రాళ్లవాగు

మంచిర్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన వర్షం 9 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసింది. కుండపోతగా కురిసిన వర్షం కారణంగా జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జిల్లాలోని హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామంలో 110.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాసిపేట మండలం కొండాపూర్‌లో 90.2, జిల్లా కేంద్రంలో 70.1 లక్షెట్టిపేట మండలం శాంతాపూర్‌లో 60.6 మీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో 2,49,916 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు నుంచి 5733 క్యూసెక్కులతోపాటు ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మరో 51,487 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 148 మీటర్లకు గాను ప్రస్తుతం 145.26 మీటర్ల ఎత్తుకు నీళ్లు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 13.221 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో 32 గేట్లను ఒక మీటర్ ఎత్తు వరకు తెరిచి 3,44,032 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. దీంతో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది.

- ఉధృతంగా రాళ్లవాగు ప్రవాహం...

భారీ వర్షం కారణంగా జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలోని కాజువే వంతెనపై నుంచి వరద ప్రవహిస్తోంది. వాగు పరిసర ప్రాంతాలైన ఎన్టీఆర్ నగర్, ఎల్ఐసీ కాలనీ, రాంనగర్, ఆదిత్య ఎన్‌క్లేవ్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. గోదావరి మరింత ఉప్పొంగితే రాళ్లవాగు బ్యాక్ వాటర్ కారణంగా ఆయా ప్రాంతాల్లోని ఇళ్లు నీట మునిగే అవకాశం ఉంది. అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవసరమైన సూచనలు చేస్తున్నారు. కాగా ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు నిలిచిపోగా, ఓబీ మట్టి తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. మూడు ఏరియాల్లోని శ్రీరాంపూర్, ఇందారం, రామకృష్ణాపూర్, మందమర్రి, గోలేటి, ఖైరిగూడ ఓసీపీల్లో దాదాపు రూ. 32.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లగా, రూ. 10 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత పనులు నిలిచిపోయాయి.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో ఉదయం భారీ వర్షం కురిసింది. చున్నంబట్టి ఏరియా ప్రాంతంలో కాలనీ జలమయంగామారింది. ఉదయం స్కూల్ వ్యాను నీటిలో నిలిచిపోవడంతో స్థానికులు సహకరించి బయటకు తీశారు.

జన్నారం: మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. మండలంలోని వాగులు, వంకల్లో నుంచి వచ్చే నీటితో పాటు కడెం ప్రాజెక్టు నీరు గోదావరిలో చేరడంతో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుంది. గోదావరి పరివాహక గ్రామాలైన కలమడుగు, జన్నారం, బాదంపల్లి, చింతగూడ ,తిమ్మాపూర్, రోటిగూడ,తపాలపూర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు సూచించారు.

కాసిపేట: కొండాపూర్‌యాప నుంచి సోమగూడెం ప్రధాన రహదారి పై ఉన్న నాలాలను ఆక్రమించుకుని కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వరద నీరు ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరు పట్టించుకోకపోవడం వల్లనే వరద నీరు చేరుతుందన్నారు.రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండాపూర్ చౌరస్తాలోని నీరంతా ఒడ్డెర కాలనీ , పల్లె మల్లయ్య ఇళ్లలోకి వరద నీరు చేరి నిత్యవసర సరుకులు ముద్దయ్యాయి.మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, దీంతో రైతులు, ప్రజలు ఎవరు కూడా వాగుల వద్దకు వెళ్లవద్దని మండల పంచాయతీ అధికారి షేక్ సప్దర్ ఆలీ అన్నారు. బుధవారం కోనూరు లో లెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీటిని పరిశీలించి దారి గుండా ఎవరు వెళ్లకుండా రెడ్ రిబ్బన్‌లు కట్టి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే రాళ్లవాగు, సల్పలవాగు, దేవాపూర్ వాగుల మీదుగా ఎవరు దాటకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రజిత, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్: మండలంలో బుధవారం ఉదయం ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. దీంతో పడ్తన్‌పల్లి ఎస్సీ కాలనీ వాసుల ఇండ్లలోకి నీరు చేరింది. గ్రామస్థులు అప్రమత్తమై దిగువన ఉన్న వారిని ఎగువ ప్రాంతానికి తరలించారు. గ్రామంలోని అంకం మల్లవ్వ ఇంటి పెంకులు కూలాయి. వర్షాలకు పెద్దంపేటలోని వరి పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మందమర్రిటౌన్: మందమర్రిలో బుధవారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఉదయం 5 గంటల నుంచి దాదాపు 3 గంటల పాటు వర్షం దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రామన్ కాలనీ, రాజన్నలవాడ రోడ్డు మీదనే నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కూరగాయల మార్కెట్ వరద నీరు చేరివ్యాపారాలు నిలిచిపోయాయి. కార్మెల్ స్కూల్ ఎదురుగా ఉన్న రోడ్డుపై నుంచి ప్రవహించి కాలనీల్లో ఇళ్లలోకి చేరింది. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఫోన్‌లో సమాచారం అందించారు. వర్షాలతో కూరగాయలు ధరలు పెరిగాయి.

వేమనపల్లి: మండలంలో గంటకు పైగా వర్షం పడడంతో రోడ్లపై నీరు భారీగా ప్రవహించింది. బుయ్యారం నుంచి వేమనపల్లికి వెల్లే మట్టి రోడ్డు అధ్వానంగా మారింది. వేమనపల్లి సరిహద్దు గుండా ప్రవహిస్తున్న ప్రాణహిత నది నిండుకుండలా మారింది. కురుస్తున్నవర్షాలకు తోడు పెన్‌గంగా, వైన్‌గంగా నదుల నుంచి భారీగా నీరు ప్రాణహితలోకి వస్తుండడంతో నది ఒడ్లపాలెం పారుతుంది. పెంకుటిండ్లలో ఎవరు ఉండవద్దని తహసీల్దార్ రమేష్ సూచించారు.


పెద్దంపేట్‌లో నీటిలో మునిగిన వరి పొలాలు



చున్నంబట్టి ఏరియాలో నీటిలో నిలిచిపోయిన స్కూల్ వ్యాన్


స్టేషన్ రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

దండేపల్లి, సెప్టెంబరు 4: గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందించే పౌష్టికాహారంతోనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ దండేపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ జాడి వెంకటలక్ష్మి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలం మాకులపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చేకూరే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు రమాదేవి, అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: గర్భిణులు, బాలింతలు పౌష్టి కాహారం తీసుకుంటేనే పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని చె న్నూరు ప్రాజెక్టు ఏసీడీపీవో శ్రావణి అన్నారు. ఇందారం 4 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహనకల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, ఏఎన్ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ కళ్యాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల పేర్లు నమోదు

మందమర్రిరూరల్, సెప్టెంబరు 4: మండలంలోని పులిమడుగు గ్రామంలో బుధవారం ఏవో కిరణ్మయి, ఏఈవోలు కనకరాజు, ముత్యం తిరుపతిలు రుణమాఫీ కాని రైతుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. అందుగులపేట, పులిమడుగు, కోటేశ్వర్‌రావుపల్లి, క్యాతనపల్లి గ్రామాలకు చెందిన 70 మంది రైతుల పేర్లను యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ కార్డు లేక రుణమాఫీ పొందని రైతులు గురువారం సండ్రోన్‌పల్లిలోని రైతు వేదికలో సంప్రదించి వారి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నీలయ్య, రాజునాయక్, బొలిశెట్టి తిరుపతి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో చేరిన వరద నీరు


నస్పూర్ కాలనీలో వరదనీటితో ప్రవహిస్తున్న డ్రైనేజీ



నస్పూర్‌లోని రాయల్ టాకీస్ వద్ద రోడ్డుపై నిలిచిన వరద

నస్పూర్: పట్టణంలో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. రోడ్లన్నీ వర్షపు నిండిపోయి కనిపించాయి. వర్షం కారణంగా ఆయా ప్రాంతాలోని డ్రైనేజీలు వరద నీటి నిండి ప్రవహించాయి. శ్రీశ్రీనగర్-వినూత్న కాలనీకి మధ్య గల తొల్లవాగు కల్వర్టుపై నుంచి వరద ఉధృతి కొనసాగడంతో కాలనీవాసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద తాకిడికి కల్వర్టు కోతకు గురైంది. దెబ్బతిన్న కల్వర్టును మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ పరిశీలించారు. వరద ప్రవాహం కొనసాగుతున్నందున అటువైపు ఏవరూ వెళ్లకుండా కల్వర్టుకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. సీతారాంపల్లి వెళ్లే మార్గంలో కల్వర్టు వద్ద వరద నీటికి చెత్తచెదారం అడ్డుతగిలి ముందుకు వెళ్లకపోవడంతో మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగించివేశారు. రాయల్ టాకీస్ వద్ద సీసీసీ రోడ్డుపై వరద నీరు నిలిచిరాపోకలకు ఇబ్బంది కలిగించింది. ఇక్కడ కొత్తగా మురుగు కాలువ నిర్మాణం చేసిన సమస్య పరిష్కరం కాలేదు. ఆయా కాలనీల్లో లోతట్టున ఉన్న ఇళ్లలోకి, పలు క్వాటర్లలోకి వరద నీరు చేరింది. సీసీసీ కార్నర్ నుంచి నర్సయ్య భవన్ వరకు జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహించింది.